చారుమతి



ఆంధ్ర సామ్రాజ్యము నశించిన వెనుక, దానికి సామంతులగుయున్న చిన్న చిన్న మాండలికులు స్వతంత్రులగు స్వేచ్ఛను జెందియుండిరి. అట్టి మండలములయందు 'శ్రీరామపురము' అనునది యొకటి. దానిని విజయభూపాలుఁడను నతఁడు పరిపాలించుచుండెను. విజయభూపునికి 'సుదర్శన సింహ' అనునతఁడు సోదరుఁడు. ఈ సుదర్శనుఁడు ప్రబలుఁడయి తన యన్నయగు విజయభూపాలుని పదభ్రష్టునిఁజేసి రాజ్యమునుండి తఱుమఁగొట్టెను.

ఇట్లు తమ్ముని దౌష్ట్యముచేఁ బదవినుండి తొలగింపఁబడి తఱుమఁగొట్టబడిన విజయభూపుడు, తన్ను వెంబడించి వచ్చిన విశ్వాసపాత్రులగు పెద్దమనుష్యులు కొందఱతోడ నడవిని ప్రవేశించెను. తాముగా తమ సంపదల సుదర్శనునకు ధారపోసి, తమ యొడయఁడు పడుపాటులను అనుభవింపఁ దెగించి, వచ్చిన పరిజనముతో సుఖముగా విజయరా జరణ్యమున వసించుచుండెను. వారు వేసవికాలములయందు ఫలపుష్ప పత్రాదులతోడి శాఖోపశాఖలచేత దట్టములగు వృక్షములయొక్క నీడలయందు నెమ్మదితోఁ గాలము గడపుచుండిరి. లేఁబచ్చికను మేసి బడియు నీటిని

ద్రావి, కండ్లకింపునింపునట్లు చౌకళించుచుఁ బేరెములు వాఱుచు వినోదము సలుపుచుండిన లేళ్లపిండునుజూచి యానందించుచుందురు. దుస్సహమైన క్షుద్బాధను పోకార్చు నిమిత్తమే మిగుల పరితాపముతో దినమునకు నొకటి రెండు లేళ్లను వేఁటాడి చంపుదురు. ఇట్లు వారను భవించునట్టి సంతోషమునకు విరోధముగా శీతకాలపు వాతములు వీఁచునప్పుడు, విజయభూపాలుఁ డోర్పుదెచ్చుకొని, "నా శరీరమును జిల్లులుచేయునట్లు వీఁచునట్టి యీ చల్లని గాలి నాకు పరమ మిత్రము. ఇది నాయొద్ద వంచనతోఁ బ్రవర్తింపక యదార్థమగు స్వీయగుణముతో నన్ను స్పృశించుచున్నది. ప్రీతిలేని కృతఘ్నుని దంతములవలె దీని పండ్లు వాఁడులయినవిగావు. దీనిని మానవ సామాన్యము దూషించునుగాని, కొన్ని యుత్తమగుణములను దీని నుండి సైతము గ్రహింపవచ్చును. భూషణములనువలె, ఔషధముల నిమిత్తము, విషయుక్తమయినదియుఁ దృణీకరింప నగునదియు నగు గోదురుకప్పతలనుండి యెత్తఁబడుపదార్థము ముపయోగింపఁ బడుచుండుటలేదా?" అని యా తెలివిగలిగిన రాజు, తాను జూచిన ప్రతివస్తువునుండియును గుణములను గ్రహించుచు, జన పదమునకు దూరముగానున్న యా యడవి యందలి చెట్లన్నియుఁ దనతో నిష్టాలాపములు సలుపు మిత్రులవలెను, సెలయేళ్లు మొత్తములు మదికి వేడ్క నింపు సత్కావ్యములవలెను, గండశైలములు మతబోధచేయు సద్గ్రంథములవలెను భావించుచుండెను.

విజయ భూపాలునకు 'చారుమతి' అను కొమార్తె యొక్కతె యుండెను. ఇతని తమ్ముఁడగు సుదర్శనుఁడు, తన యన్నను రాజ్యభ్రష్టునిఁగాఁ జేసి తరుముఁగొట్టి నప్పుడీ చారుమతిని తన కూఁతురగు కళావతి నిమిత్తము తన యొద్దనే నిలుపుకొని యుండెను. కళావతీ చారుమతులకుఁ గల్గియుండిన స్నేహానుబంధము సుదృఢ మైనది. వీరి తండ్రులు పరస్పర విరోధముచే మెలఁగువారే యైనను వీ రిరువురును నెడతెగని చెలిమి గలిగి వెలయుచుండిరి. మఱియును కళావతి, చారుమతికిఁ దండ్రివలని దుఃఖము మనస్సునకుఁ దోఁపని విధముగాఁ బ్రవర్తించుచుండెను. అట్లుండియు నొకా నొకప్పుడు తండ్రిని దలఁచి చారుమతి దుఃఖించుటను గనుఁగొనెనా, దానికి సంతుష్టి గలుగునట్టి పనులను తనకు సాధ్యమగునంతవఱకును జేయుచుండును. వేయిమాటలేల ? కళావతియొక్క ప్రయత్నము లన్నియును చారుమతిని సంతోష స్థితియందుఁ బెట్టుటయందే కొనసాగుచుండెను.

ఇట్లుండఁగా నొక దినము వాడుక మేరకు కళావతి చారుమతి యున్న స్థానమునకుఁ బోయి సంభాషించుచుండెను. అట్టియెడ, కంచుకి యొకఁడా చోటికి వచ్చి, " మిమ్మును బిలుచుకొని వచ్చునట్లు రాజాజ్ఞ యైనది. ఇప్పుడు ప్రభువు నెదుట మల్ల యుద్ధము జరుగఁబోవుచున్నది. తత్క్షణమే మీరాకలు కావలయును " అని విన్నవించెను. కళావతి, మల్లయుద్ధమును జూచుట చేత చారుమతి చిత్తము

నకుఁ గల్పించియున్న వ్యథ తొలఁగి సంతోషము సంభవింపఁ గలదనుటను చింతించి, యాచోటికిఁ బోవుటకు సమ్మతించెను.

ఆ కాలమునందు మల్లయుద్ధము ప్రభువుల చేతను, రాజుల చేతను సంభావింపఁబడిన విద్యయైయుండెను. అన్ని సంస్థానములందు జరుగునట్టి మల్లయుద్ధములను జూడ నిచ్చగొని అంతఃపురములోని నారులు సైతము మట్టిచోటులకు వచ్చి మఱుఁగైన ప్రదేశములయందుండి చూచుచుందురు. కాఁబట్టియే, ఇప్పుడు జరుగు మల్లయుద్ధమును జూడ కళావతి చారుమతులు పోయిరి. వారు తాము చేరవలసిన ప్రదేశముఁ జేరఁగానే, వారి హృదయములానందరస మగ్నము లగుటకు మారుగా శోకవ్యాకుల పీడితము లాయెను. ఏలనఁగా — మల్లయుద్ధముచేయ సమకట్టిన యువపురుషులలో నొకఁడు మహాప్రబలుఁడు. మల్లయుద్ధమునఁ జిరకాల పరిశ్రమను గలిగి యనేక వీరులను జంపి బిరుదావళులను బొందినవాఁడు. మిగుల కర్కశదేహుఁడు. మఱియొకఁ డన్ననో, మిగుల కోమలమగు శరీరము గలవాఁడు. మల్లయుద్ధమున నేమాత్రమును బరిశ్రమ లేనివాఁడు. కరుణారసము వెల్లివిరియునట్టి చూపులు గల లేఁ బ్రాయము వాఁడు. మల్లయుద్ధమును సంగ్రహింపఁ వచ్చినవా రందఱును తప్పక యీయువుఁడు చంపఁబడునని యభిప్రాయ పడుచుండిరి.

సుదర్శనరాజు, తన పుత్త్రికయగు కళావతిని భ్రాతృపుత్త్రికయగు చారుమతిని జూడఁగానే వారి దగ్గఱకుఁ

బోయి, "పృథ్వీకలారా! మల్లయుద్ధమును జూచుటకునై కదా యిచ్చటికి వచ్చియున్నారు! మీ రింతలోనె వింతను గనుఁగొనఁగలరు. ఈ మల్లురయం దేర్పడిన తారతమ్య మయినది మీకు వింతను గలిగింపక మానదు. ఈ యువ నిని గూర్చి పరితాప పడి యీ యుద్ధమునుండి తొలఁగు మని యనేకవిధములుగా బోధించితిని. వాఁడీ ప్రయత్నము నుండి విముఖుఁడు గావలయుననియే నాయభిమతము. పృథ్వీ కలారా! మీరును బ్రయత్నించి సాధ్యమగునేని, వానిని యుద్ధమునుండి తొలఁగింపుఁడు" అనెను.

ఆ యిరువురు కన్యకామణులును స్వనిపుణతలను నిట్టి కార్యమునందు వినియోగించుటకు సంతోష పూర్వకముగా నుద్యుక్తలైరి. మొట్టమొదట, కళావతి వానిని దాపునకు రావించి యట్టి ఘోరప్రయత్నమును మానవలయునని యుక్తియుక్తముగఁ జెప్పెను. పిదప, చారుమతి, ఆ యువుని సంబోధించి అనురాగవంతము లగు తన చూపులు వానిపైఁ బ్రసరింపఁజేసి, ఆ యుద్ధమున వానికిఁ గలుగఁబోవు నాపదను సనుతాప పూర్వకములగు మృదు వచనములతో బోధించెను. చారుమతి చూపులు వాని నా యుద్యమమునకుఁ బ్రోత్సాహ పఱచెనుగాని, దాని మాటల యభిప్రాయానుసారము యుద్ధ విముఖునిగావింపలేదు. వాఁడు, తన యెడల కళావతీ చారుమతులు తొంటికంటె నెక్కువగా నాదరాప పడునట్లు, తన మృదు మధుర వచనములతో వారి హితోక్తుల నుల్లంఘించి యిట్లు పలికెను.

“యువతీ మణులారా! మీ యభిమతములకు విరుద్ధముగా, నా పూన్కిని వదలఁ జాలకున్నాను. నా యుద్యమమునకు మీ చూపులును సదుద్దేశములును గోడుపడనిండు. నా యీ ప్రయత్నమందుఁ గృతార్థుఁడ నైతి నా, లోకమునం దెన్నటికిని నశింపని కీర్తిని సంపాదించిన వాఁడ నయ్యెదను. చంపఁబడితినేని చావు నపేక్షించిన యొకఁడు లోకమునుండి తొలఁగెనని యనుకొనుఁడు. నేనా కారణముచే నా హితులకు విరోధముగా మెలఁగిన వాఁడనుగాను. ఏలనఁగా నన్ను గూర్చి శోకించు వాఁడొక్కఁడు గాని యీ ప్రపంచమునందు లేఁడు. కావున నేనీ లోకమునుండి తొలఁగితినేని నా చోట నుత్తముఁడగు పురుషుఁడొకఁడు వెలయవచ్చును గదా!”

తదనంతరము మల్లయుద్ధము ప్రారంభించెను. కళావతి యీ యువుఁడు హింసింపఁ బడరాదని కోరుచుండెను. చారుమతియో వాని శ్రేయమందే లగ్నమయిన చిత్తవృత్తి గలదయ్యె మిగుల పరితాప పడుచుండెను. వాఁడు లోకమునందలి తన నిష్ప్రయోజక స్థితిని గూర్చి చెప్పి యున్నందునఁ దనవలెనే లోకమును నిరాకరింపఁదగిన దౌర్భాగ్యుఁడని వానియందలి తన యనుకంపను నించి జాలిపడెను. ఇట్లు వాఁడు మల్లునితోఁ బోరు సలుపుచున్న కాలమున చారుమతి వానిని గుఱించిన తలంపులనే కలిగినదయి తుదకు వానినే వరింప నెంచినదియు నయ్యెను.

తమకుఁ బూర్వపరిచితుఁడు గాని యువుని విషయమున ననుకంపనించిన యీయువతీమణుల సదుద్దేశము తే

వానికి ధైర్యస్థైర్యములను బ్రసాదించెను. ఆ కారణమును బట్టి, వాఁడు మిగుల తెగువరియు వైరవరియునై మల్లయుద్ధ విశారదుని వలె మెలఁగనేర్చి చూపఱకండ్లకు వింతగలిగించుచుండి తుద కొక మోఁదు మోఁది యా ప్రఖ్యాతుఁడైన మల్లుని నేలగూల్చెను. ఆ మోఁదా మల్లుని కొంతకాలము దనుక కదలుటకుఁ గాని పలుకుటకు గాని కానంత దుర్బలునిగాఁ జేసివైచెను.

ఆయువుని ధైర్యసాహసాదులకు మెచ్చి, సుదర్శనుఁడు, వానిని తనయూదరమునకుఁ బాత్రునిఁ జేయఁదలఁచి వాని యునికి మనుకులను దల్లిదండ్రులను దెలియఁగోరెను.

వాఁడు, తాను సుధర్ముని కడపటి కొమారుఁడగు సుశర్మయగుటను జెప్పెను.

ఆయువుని తండ్రియగు సుధర్ముఁడు చనిపోయి కొన్ని సంవత్సరములాయి యుండెను. అతఁడు బ్రదికి యున్నంత కాలము దేశభ్రష్టునిగాఁ జేయఁబడిన రాజు నెడల మిగుల శక్తిగల వాఁడయి యుండెను. కాఁబట్టి, సుదర్శన రాజు సుధర్ముని పేరు వినఁగానే, సుశర్మయందలి తనకుఁ గలిగిన యభిమానము తొలఁగెను. అట్లు ప్రీతి తప్పుటయే కాక వానిని గూర్చి యపరిమితాగ్రహము సంభవించెను. ఆ యువుఁడా సంస్థానమునుండి తొలఁగఁగానే, సుదర్శనుఁడు తన సోదరుని యొక్క మిత్రులయందు అవగ్రహమును యువుని ధైర్యస్థైర్యములను గూర్చి యనుగ్రహమును అచ్చటి వారికి

విస్పష్టమగునట్లు ,, ఆహా! వీఁడు సుధర్ముని పుత్రుఁడు గాక మఱియొకని కుమారుఁడుగా నుండిన నెంతో చక్కఁగా నుండునే '' అని పలికెను.

సుశర్మ తన తండ్రికి విశ్వాస పాత్రుఁడగు సుధర్ముని పుత్రుఁడగునట్లు చారుమతికిఁ దెలియఁగానే, దానికి వాని యందుఁగల ప్రీతి యినుమడించెను, కాఁబట్టి, తన సమీపమునందున్న కళావతిని జూచి, ,, కళావతీ! నేనీ యువుని యందు ప్రేమ నిలిపితిని. ఇతఁడు నా తండ్రిగారి ప్రియ మిత్రుని కొమారుఁడగుట నాకుఁ బూర్వమే తెలిసియుండిన యెడల నేను వీని యిట్టి సాహసచర్యకుఁ గండ్లనీరు నింపి యుందును '' అనెను చారుమతి.

తదనంతర మీ యువతీమణులు, సుదర్శనుని యప్రీతికిఁ బాత్రుఁడయి మరలి పోవుచున్న సుశర్మనుడాసి ప్రియోక్తులను బలికి వానిమనస్సునకు సంతోష మొనకూర్చి యీవలికి మరలిరి. కొన్నియడుగు లీవలికి వచ్చినవెనుక, మరల నేమో తన తండ్రి నెయ్యుని కొమారునితో మంతనము లాడవలసి యుండి మరలినట్లుగా నటించి, చారుమతి వాని యొద్దకుఁ బోయి, ,, ఓయి యువుఁడా! మల్ల యుద్ధమునం దెక్కువ సాహసము నెఱపినందులకు దీనిని బహుమానము గాఁబొంది తనివి నొందుము. నేను మంచిస్థితియందుంటి నేని యింకను నీకు విలువగల బహుమాన మొసఁగి యుందును'' అని తన మెడ నున్న చంద్రహారమును దీసి వాని చేతి కొసఁగెను.

ఆయిరువురు యువతీమణు లేకాంతముననున్న వేళ చారుమతి సుశర్మను గూర్చి ప్రశంసింప మొదలు పెట్టెను. అప్పుడు కళావతి, తన సోదరి యా యువునియందు మనస్సు నిలుపుటను గ్రహించి ‘‘చారుమతి! ఇంతత్వరితముగానే యొకనిని నీమానసమునందు నిల్పుట కయితివా!’’ అని యడిగెను. ‘‘ఔను, కళావతీ! వాని తండ్రి నా జనకుని ప్రేమించుచుండెను కదా!’’ అనెను చారుమతి. ‘‘కాఁబట్టి నీవు వానిని వరింపవలెనో? అట్లయినచో నా తండ్రి వాని జనకుని ద్వేషించుచుండెను, కావున నేను వానిని ద్వేషింపవలెను. అట్లుకాక నేనును వానిని ప్రేమించెదను కదా!’’ అనెను కళావతి.

సుదర్శనుని మనస్సు క్రోధరస పూరితమయి మండఁ జొచ్చెను. సుశర్మతండ్రి యిట్టివాఁడని దెలియరాఁగా, మల్లయుద్ధమును జూడవచ్చియున్న జనుల హృదయమునకు విజయ భూపాలుని జ్ఞాపకముగలిగి, అతని సత్కార్యములను ప్రజానురంజకతను, తమ్మునివలననే యతనికిఁ గలిగిన భంగ పాటును దలఁచి తలఁచి దుఃఖింపఁ దొడఁగిరి. చారుమతి యొక్క సద్గుణములకును దాని దుస్థితికిని దురపిల్ల సాఁగిరి. ఇవన్నియుఁ దెలిసిన సుదర్శనుఁడు, బగ్గునమండి, చారుమతి తోడ సుశర్మనుని గూర్చి మాటలాడుచుండిన కళావతి యున్న యెడకుఁ బోయి చేరెను.

అంతట, సుదర్శనుఁడు కోపముచేఁ గనులెఱ్ఱఁ బాఱఁగా, చారుమతిని జూచి, ‘‘నీ వీక్షణమే యీ

చోటువదలి దేశభ్రష్టుండైన నీ తండ్రిని చేరుసది", అని క్రూరతద్వేషం బలికెను. అందులకు గళావతి, చారుమతి పక్షమూని నిజ జనకుని నెంత వేడుకొనినను నతనికి దయపుట్టదయ్యెను. మఱియును గళావతి "నేను పసిదానను గా నున్నప్పుడు చారుమతియొక్క ఆవశ్యకత నాకుం దెలియకుండెను. ఇప్పుడు, చారుమతి యెంతటిగుణగుణ్యయో, దీనివలన నాకెంత మేలుగలుగుచున్నదో, నాకుం జక్కంగాం దెలియుచున్నది. అట్టి యీ చారుమతితో సర్వదా మైత్రి గలిగి, జతగా భుజించుచు, జతగా విహరించుచు, జతగా శయనించుచు, జతగా మేల్కాంచుచు నెడంబాయక మెలంగుచుండిననేను దీనిని బాసి యెట్లుండ నోపుదును. కాంబట్టి, తండ్రీ! ఈ యువతీమణియందు, నన్నుందలంచి కనికరము నింపుము" అని పలువగల బతిమాలెను.

"అది మానముగా నుండియే కార్యములను సాధించుచున్నది. దానియోర్పునకును మూంగతనమునకును మెచ్చి జనులు దానినే పొగడెదరు. దానికొఱకు వాదించునట్టి నీ వెంత బుద్ధిహీనురాలవో; అది యిచ్చట వసించునంత వఱకును నీయొక్క సద్గుణములు సూర్యుని యెదుట దీపమువలెం బ్రకాశింపవు. దాని కనుకూలముగా మాటలాడ నోరు తెఱవకు. ఏలనంగా దాని ననుసరించి నేననుభవించు నపవాద ఖేద మింతంతగాదు" అనెను సుదర్శనుండు.

కళావతి చారుమతి పక్షమూని పలుకుటకుం గొంచెమైనను చోటులేక పోయెను. తండ్రిని ధిక్కరించి పలుకుట

వ్యర్థమని దానికిఁ దోఁచెను. కావునఁ దాను జారుమతితోఁ బల్లాయనము చిత్తగింపవలయునని నిశ్చయించుకొనెను.

వారు పయనమగుటకుఁ బూర్వము, కళావతి తన సోదరినిజూచి ''మనము వస్త్రభూషణాద్యలంకారములతో నూరుతిరుగఁ బూనితిమేని మనయెడల నితరులకు సందేహము గలుగును; లేదా దోఁపిడి గాండ్రకైనను జిక్కి శ్రమనొంద వలసి వచ్చును. కాఁబట్టి మనము పల్లెటూరి పడుచులవలె వేసము వేసికొనియే బయలుదేరవలయును'' అనెను. ''ఇంత కంటెను మేలుగ నాకొక యుపాయము దోఁచుచున్నది. మనలో నొకరు పురుషవేషమును ధరింపవలయును. అట్లు చేసినచో నపాయమును గూర్చి మనము చింతింప వలసిన పనియేలేదు'' అనెను చారుమతి. ఈ యుపాయమునకు కళావతియును సమ్మతించెను. చారుమతి, కళావతికంటెఁ గొంచెము పొడువుగలిగి యుండుటచేత పురుషవేషమును ధరించి తిమ్మఁడని పేరుపెట్టుకొనెను. కళావతి పల్లెటూరి పడుచువలె వేసము వేసికొని పేరమ్మయని పేరుపెట్టుకొనెను. ఈ పేళ్లతోను వేసములతోను వారు తమ యొద్దనున్న ధనమును భూషణములను మూటకట్టుకొని చాలదూరమునందు విజయభూపాలుఁడు వసించుచుండిన యరణ్యమునకుఁబోయి చేరవలయునని ప్రయాణమయిరి.

అనేక క్రోశముల దూరమునందుండునట్టి యడవికి వీరు పాదచారిణులయి పోవునప్పుడు, తన యెడల స్నేహము నించి తన్ననుసరించివచ్చిన తన సోదరికి శ్రమగలుగనట్లుగా

పురుషవేషమును వహించిన చారుమతి యదార్థముగా పురుషధైర్యమును సైతము నవలంబించెను. మార్గాయాస ముదోఁపనట్లుగా కథలను జెప్పికొనుచు, చమత్కార వాక్యములను బలికికొనుచు, ప్రకృతి పదార్థముల వింతలను జూచుచు వారు దారి నడచుచుండిరి.

తుదకు వారు, ఆ యరణ్యముయొక్క యెల్లయొద్దకుఁ బోయి చేరిరి. తిమ్మనికి పైకొక యడుగు పెట్టుటకును సాధ్యపడలేదు. తాను ధరించిన పురుషవేషమున కవమానము గలుగునట్లుగా శ్రమను దెలుపు వాక్యములు పలుకుట తిమ్మనికి వెగటుగాఁగనఁబడెను. పేరమ్మ బొత్తిగా ముందుకు నడవలేనిదియై దారిప్రక్కనున్నయొక చెట్టుక్రిందఁ గూలఁబడెను. అప్పుడు, ''స్త్రీలకుఁ దటస్థించిన కష్టములను దొలఁగించి యుపచరించుట పురుషుల భారమేయగును. [redacted]వున కుహనాపురుషుఁడనగు నేను పేరమ్మకుఁ దటస్థించిన శ్రమను బోకార్చి యుపచరింపవలదా?'' అని యోపిక దెచ్చుకొని తిమ్మఁడు, పేరమ్మా! ఇంక కొంతదవ్వే యున్నది. మన ప్రయాణమును ముగించినవారమే యైతిమి. ఓపికను దెచ్చుకొని నా వెంబడినే రా! అని యుపచార వాక్యములను బలికెను గాని, అసూర్యంపశ్యలయి యుండిన కుసుమ కోమలులకు, నన్నపానంబులును నిద్రా సుఖంబులును దొలఁగి దూరసంచారము చేయు పట్టున దెచ్చుకోలు ధైర్యమెంత వఱకుఁ దోడుపడఁగలదు. కావున నా యిరువురు నాతరుమూలముననే సొమ్మసిల్లి కూర్చుండిరి. దైవాధీనముగా

నా మార్గమున నొక పురుషుఁడు పోవుచుండెను. వానిని జూడఁగానే మఱియొక తడవకు ధైర్యమును దెచ్చుకొని, ఎలుగెత్తి యా పురుషుని దాఁపునకు బిలిచి "అయ్యా! ద్రవ్యమును దీసికొనియైనను, పరోపకార బుద్ధినైనను మీరు మాకు సహాయపడియే తీరవలయును. నా సోదరి, యన్న పానములు లేక పెక్కు క్రోసుల దూరము పాదచారిణియయి వచ్చినందున సొమ్మసిల్లియున్నది. ఏవిధముచేతనైనను మా ప్రాణముల రక్షించెడు భారము మీది. మీరే మా పాలిటి కీశ్వరుఁడని భావించెదము" అనెను.

వాఁడా మాటలకు "అయ్యా! ఇదిగో పిలుపు దూరమునందే యుండునట్టి యొక గొల్లవానికి నేను సేవకుఁడను. అతఁడు, తనయింటిని గొడ్డు గోదలను నమ్మి వేయునంతటి దుస్థితియందున్నాఁడు. మీరచ్చటికి వచ్చితిరేని యంత గొప్పగా లేక పోయినను సాధారణముగా నైన నుపచారములు జరుగును" అనెను.

సమీపమునందే తమకు సౌఖ్యములభింపఁగలదను తృప్తి వారికి నూత్నబల మొసఁగినందున వారాపురుషుని వెంట నరిగిరి. అచటికిఁ బోయి తమ శ్రమను దీర్చుకొనిన వెనుక, ఆ గొల్లవాని గుడిసెను వాని గొడ్డుగోదలను దామే విలిచి, తమ్మచ్చోటికిఁ బిలుచుకొని పోయిన పురుషునే తమకు సేవకునిగాఁ జేసికొనిరి. ఆ యటవి యందలి విజయ భూపాలుఁడు గనఁబడునంత వఱకును దామచ్చోటనే నివసించుచుండవలెనని యును దీర్మానించు కొనిరి.

వారు దమ మార్గాయాసమును దీర్చుకొనిన వెనుక, తాము ముందు కెట్లు మెలఁగవలయునో యాలోచించువారై గొల్లవాఁడును వాని సోదరి యగు గొల్లదియునుగా నటింప వలయునని తీర్మానించుకొనిరి. అట్లుండియును దిమ్మఁడని పేరు పెట్టుకొనిన యువతీమణి తానొకప్పుడు చారుమతిగానుండి సుశర్మవలచియుండు సంగతిని పలుమాఱు తలఁపునకు దెచ్చు కొనుచుండును. ఏలనఁగా సుశర్మ జనకుఁడగు సుధర్ముఁడు తన తండ్రిగారి ప్రియ మిత్రుఁడు. సుశర్మ పెక్కు మైళ్ళ దూరమునందుండి నప్పటికిని వాఁడొకా నొకదినము దమ యరణ్యమునందుఁగానఁబడ కాఁగలఁడని భావించెను.

సుశర్మ సుధర్మునియొక్క కనిష్టపుత్రుఁడు. సుధర్ముఁడు చనిపోవునప్పుడు తన జ్యేష్ఠపుత్రుఁడగు గుణదేవునిఁ బిలిచి, వానికి సుశర్మ నప్పగించి ‘‘నీవు మన వంశపు గౌరవమున కనువుగా వీనికి విద్యాబుద్ధులను గఱపి, మంచి స్థితికిఁ దేవల యును’’ అని చెప్పి కాలగతిఁ జెందెను. గుణదేవుఁడు పితృ వాక్యములను బరిపాలింపక పరమద్రోహియై మెలఁగఁ దొడఁ గెను. వాఁడు తన సోదరుని బడికిఁ బంపినవాఁడే కాఁడు. వాని గొప్పస్థితికి బ్రయత్నమించుకైనను జేయక యూరక వదలి పెట్టెను. అట్లుండియును, సుశర్మ తన తండ్రియొక్క యుత్తమగుణము లన్నిటిని గలిగి, చూచువాండ్రు ఘనశిక్షి తుఁడైన బాలుఁడని చెప్పునట్లు మెలఁగుచుండెను. వాఁడుత్తమగుణము లన్నిటిని సహజ గుణములుగాఁ గలిగి యుండెను. కాఁబట్టి జనులు గుణదేవుని కంటె సుశర్మ

యెడల నెక్కువ మక్కువ గలిగి మెలఁగు చుండిరి. ఈ కారణమును బట్టి తమ్ముని యెడల గుణదేవున కసూయ మిక్కుటముగాఁ గలిగెను. ఆ యీర్ష్య బలమగుచు వచ్చి తుదకు సుశర్మను జంపి వేయవలయునను నంతకుఁ బరిణమించెను. ఈ యుద్దేశమును గొనసాగించు కొనుట కొఱకే, ఇది వఱకుఁ జెప్పబడిన మల్లునితో [illegible] సలుపునట్లు నియమించెను. ఈ వి[illegible] సోదరుని [illegible] శత్రువగు సోదరుని తోడ [illegible]గుటకంటెను మరణ[illegible] హింసనుండి తొలఁగవచ్చు" [illegible] వైరాగ్యమును సు[illegible] బోధించెను.

గుణదేవుని యుద్దేశము[illegible] విరోధముగా [illegible] విజయము గలిగెను. ఈ సంగతి [illegible]డనే గుణ[illegible]ఁడు బగ్గునమండిపడి, వాఁడు నిదురించుచు[illegible] యింటి కగ్ని దరికొల్పి హత్యచేయవలయునని యనుకొనెను. వాఁడు తన యుద్దేశమును గూర్చి సుధర్మునకు మిత్రుఁడును, సుశర్మ యెడలఁ బ్రీతిగలవాఁడును నైన వృద్ధుఁడగు వర్ధమానునితో రహస్యముగాఁ జెప్పుకొనెను. ఈ వర్ధమానుఁ డొకప్పుడు సుధర్మునకు సేవకుఁడుగా నుండిన వాఁడు. సుశర్మ తండ్రిని బోలిన యుత్తముఁడగుటఁ బట్టియు, అన్నయొక్క దౌష్ట్యములకుఁ జిక్కి బాధనొందు చుండుటఁ బట్టియు వాని యెడల మిక్కుటముగా మక్కువ గలిగియుండెను. ఈ వర్ధమానుఁడు, సుశర్మ రాచనగరినుండి వచ్చుచుండగానే సంధింప వలయునని యెదు రేఁగెను.

జయశీలుఁడై సంతోషముతో వచ్చుచుండిన, సుశర్మనుజూచి, "ఓసుశర్మా! నీవేల యింతబుద్ధిశాలివిగాఁ బుట్టియున్నావు? నీవు జీవించి, కీర్తిమంతుఁడవై యుండుట నీయన్నకు సరిపడలేదే! అక్కటా! నీయుత్తమ గుణములే నీకు ముప్పుగలిగించెడిని. నీవేల యాప్రసిద్ధుఁడయిన మల్లుని జయించితివి? నీకంటె ముందుగాక దానీప్రతాపము వ్యాపించెను" అని వర్ధమానుఁడు ప్రలాపింపఁ దొడఁగెను. వాని మాటలయొక్క యభిప్రాయమిట్టిదని సుశర్మకుఁ దెలియ వచ్చినదిగాదు. కాఁబట్టి, వాఁడు చెప్పఁబోవు సంగతిని గూర్చి మిగుల నాత్రముతో నడిగెను.

వర్ధమానుఁడు సుశర్మనుజూచి "నీవు జనుల మెప్పు వడసి మెలఁగునట్టి మెలఁకువయే గుణదేవునకు నీయెడల నీర్ష్యను గలిగించెను. నీవు మల్లుని జయించి రాజుగారి పొగడికకుఁ బాత్రుఁడవైన సంగతిని విని, నేఁటి రేయి నీవు నిదురించుచుండగా నీ యింటిని బరశురామ ప్రీతి గావింప వలయునని యుద్దేశించి యున్నాఁడు కాఁబట్టి, వాని కండ్లఁ బడకయే తప్పించుకొనుటకుఁ బ్రయత్నింతువేని- బ్రదుక గలవు. చేఁత ధనములేక యున్నట్లుండి యెట్లు పరదేశము లకు వలసపోవుటయని చింతింతువేని, వినుము; నా యొద్ద వేయి రూపాయలున్నవి. ఇంతయే నేను బాల్యమ్మునుండి సంపాదించి చేర్చి పెట్టుకొనిన మూలధనము. ఈ మొత్తము నీ తండ్రిగారికి నేను సేవకుఁడనై యున్నప్పుడు, నా ముసలి తనమునకు నుపయోగపడునని చేర్చియుంచుకొంటిని. ఈ

మొత్తమును దీసికొనుము. దీనితో నా సంరక్షణ భారమును సైతము వహింపుము. నేను నీకుఁ జేయవలసిన పరిచర్యల నన్నిటిని జేసెదను" అని చెప్పెను.

ఆ మాటలను వినిన సుశర్మ వర్ధమానుని యెడల మిగులఁ గృతజ్ఞత గలవాఁడై, "అయ్యా! నీవీకాలపువాఁడవు గావు. పూర్వకాలమునఁ గొనియాడఁబడుచుండిన సద్గుణ గణములు నీయందెట్లు ప్రకాశించుచున్నవి! మనమిరువురము నెచ్చోటికైనను బోవుదము. నీ మూలధనము వ్యయమగు టకు మునుపే మన యిరువురి జీవితమునకై యుద్యోగమును సంపాదించుకొనెదను" అని పలికెను.

ఇవ్విధముగాఁ గృతజ్ఞుఁడగు వృద్ధసేవకుఁడును వాని యజమానుని పుత్త్రుఁడును దూరదేశములకుఁ బయనమైరి. వారిరువురు నేయుద్దేశము లేకయే జయపాల భూపుఁడు వసించుచున్న యరణ్యము దనుక ప్రయాణము చేసిరి. తొల్లి చారుమతియును కళావతియు నన్నపానముల కొఱ కెట్టి దుస్థితి ననుభవించిరో యట్టి కష్టమునకే గుఱియైరి. వారు సొమ్మసిలి కూలఁబడునంత వఱకును మనుష్యుల నివా సమును దెలిసికొనుటకై చుట్టుప్రక్కలకుఁ దిరిగితిరిగి వేసా రిరి. తుదకు వర్ధమానుఁడు సుశర్మనుజూచి, "అయ్యా! ఆహారము లేమిచేత నేను జనిపోవుచున్నాను. ఇంక నడు గెత్తి పెట్టుటకుఁ గాదు" అని తాను గూర్చున్న ప్రదేశమే తనకు వధ్యస్థానముగాఁ దలఁచి, నేలపైఁ గూలఁబడెను. సుశర్మ తన ముసలి సేవకుని దుస్థితిని గనుఁగొని వానిని

దన మూఁపుపై నెక్కించికొని చెట్ల నీడలందు కొంత దవ్వు వఱకుఁ బ్రయాణము చేసెను. తుదకుఁ దన మూఁపుమీఁది ముసలివాని నొక్క చెట్టునీడనుదించి, అయ్యా, వృద్ధుఁడా! ఈ చెట్టునీడను కొంత విశ్రమించి యుండుము. చావుమాటనే స్మరింపకుము" అని నుడివెను.

అట్లు ముసలివానిని దించి సుశర్మ వాని యాహారము సంపాదించుటకై ప్రయత్నించెను. వీఁడట్లు దిరుగుచుండి విజయభూపుఁడున్న చోటిని జేరెను. అప్పుడతఁడు, తన యనుచరులను గూడి చెట్ల నీడయందుఁ గూర్చుండి భోజనము చేయుట కారంభించు నట్టి తరుణముగా నుండెను.

ఆఁకలిచేత దీవ్రపటుపఁ బడిన సుశర్మ మూర్ఖుని వలె నొరనుండి ఖడ్గము దూసికొని, వారు భుజింపనున్న యాహారమును బలాత్కరించి యుపహరింప వలయునని యుద్దేశించెను. కాఁబట్టి, వారినిజూచి, "కబళము నోటికిఁ బోనీకుఁడు; ఆఁగుఁడు. మీ యన్నము నాకుఁ గావలసి యున్నది" అనిచెప్పెను.

ఆ మాటలకు విజయభూపుఁడు, "నీవు ఆఁకలిచేతఁ బీడింపఁబడిన వాఁడవై యిట్లు పలుకుచున్నావా? లేక స్వభావము చేతనే మూర్ఖత గలిగి యిట్టి సాహస కృత్యమునకు లోఁబడితివా?" అనెను.

ఈ పలుకులను వినఁగానే సుశర్మ తన నడవడికకు లజ్జపడి తన ఖడ్గమొరలో వైచి, "అయ్యా! క్షమిం

పుఁడు; క్షుద్బాధ నన్నట్టి దుస్స్థితికిఁ దెచ్చి వదలెను. ఇయ్యది యరణ్యమగుటం బట్టి యిందుండు వారందఱును మృగప్రాయులని దలఁచి పొరపాటుగా మెలఁగితిని. మీ రలీ యడవిలోని యీ చెట్ల నీడలయందుఁ గాలము వ్యర్థముగాఁ గడుపుచుఁ గష్టము లనుభవించుచుండువారుగాఁ గన్పట్టి నప్పటికిని దొల్లి యొకప్పుడు ఉన్నత స్థితి ననుభవించిన వారుగాఁ గనఁబడుచున్నారు. మీరు పురములయందు వసించి, కరుణయొక్క మహిమ ననుభవించి, కష్టపడువారిని జూచి యనుకంపనుంచి కన్నీరు నించినవారై యుంటిరేని యాఁకలిచేఁ బరితపించు వీనికిఁ గొంత దిండి పెట్టుఁడు" అని దీనతగోఁప నడిగెను.

"ఔను, యువుఁడా! నీవు చెప్పినట్లే మేము నగరములయందు వసించి, దయాళుత్వము మహిమను పూర్ణముగా ననుభవించిన వారము. నీవు చెప్పినట్లే కష్ట మనుభవించిన వారి యెడల ననుకంప దలఁచి కన్నీరు నించిన వారము. నీవింక వలయునంత యాహారమును దిని తృప్తి జెందుము" అని యావృద్ధ రాజు పలికెను.

"అయ్యా! నాతోడ నొక వృద్ధుఁడు వచ్చియున్నాఁడు. అతనికిఁ బెట్టకయే నేనొక కబళమైనను దినుటకు తెగింపను" అనెను సుశర్మ.

"అట్లయిన నతనిని బిలుచుకొని రమ్ము. నీ తోడ నతఁడును భోజనము చేయును గాక! మీరు వచ్చునంతకు మేము భుజించుట లేదు" అనెను విజయ భూపాలుఁడు.

అంతట, సుశర్మ, తన పిల్లల కెరను సంపాదించుకొని గూటిదరికిఁ బోవు పావురమువలె, నొక పరుగున ముసలి వాఁడున్న యెడకుఁబోయి, వానిని దన భుజశాఖలఁ బట్టి, యెత్తుకొని విజయ భూపుఁడున్న యెడకు వచ్చిచేరెను.

విజయభూపుఁడు సుశర్మను జూచి, ,, నాయనా! నీవట్లు ముసలివానిని దింపి కూర్చుండుము. మీ రిరువురును మా యదృష్టవశమున నతిథు లయితిరి. ఇట్టి గహన గర్భమునందు సత్పాత్రులు దొరకుట యరుదు'' అని యుపచరించుచు వారికి వలయునంత నన్నపానముల నొసఁగెను. ముసలి వాఁడును యువుఁడును భోజనానంతరము దొల్లిటి వలె శరీరపాటవము గలిగి యన్నశోష నుండి తప్పి బ్రతికిరి.

సుశర్మను గూర్చి విజయ భూపాలుఁడు విచారింపఁగా నతఁడు తన ప్రేమ కాస్పదుఁడుగా నుండిన సుధర్ముని పుత్రుఁడని దెలియ వచ్చుటయే కాక వాని యన్నయొక్క-డాష్ట్యమును దెలియవచ్చెను. కాఁబట్టి, అది మొదలు సుశర్మను వాని ముసలి సేవకునిని దన పోషణమునందుంచుకొనెను విజయభూపుఁడు. వా రిరువురును మిగులఁదృప్తితో నా యరణ్యమందే నివసించువారైరి.

సుశర్మ, యీ యరణ్యమును జారుమతియుఁ గళావతియుఁ బ్రవేశించి గొల్లవాని గుడిసెను విడిచిన కొద్దిదినములలోనే చేరినవాఁడు. ఇతఁడు తాను వనమునందుఁ బ్రవేశించిన దినము మొదలు కొని తానింతకు ముందు

వరించి యుండిన చారుమతి ధ్యానమే ప్రబలముగాఁ గల వాఁడయి, అందఱి చెట్లమీఁదుగా దాని పేరును విలిఖించుచు దానిని వర్ణించి పద్యములను వ్రాయుచుఁ దిరుగు చుండెను.

వృక్షములయం దింతకుమున్ను లేని నూత్నములయిన యీ లేఖలను గని కళావతియును జారుమతియును విభ్రమితలైరి. దీని రచించినవాని యంశము వారికి దురూహముగానుండెను. ఇట్లుండఁగా, వారు వనమునందు విహరించుచుండగా నొక యువుఁడు వారికంటఁబడెను. వాఁడు, వనమునందుఁ ద్రిమ్మరువాఁడును మోహితుఁడునుగా నుండుటం బట్టి వాని యానవాలు గనిపట్టుట దురూహముగా నుండినప్పటికిని, వాఁడు మెడను ధరించిన హారమును బట్టి వాఁడే సుశర్మగా వారికి దృఢపడెను.

సుశర్మ తిమ్మనిఁ జూడఁగానే, "వీనియందేలకో పురుష వేషముల వడియున్నది. వీఁడు నాహృదయమును దొంగిలిన చారుమతివలెఁ గన్పట్టుచున్నాఁడు" అని సందేహింప మొదలు పెట్టెను. దేనికోఁటకుఁ దాను నిద్రాహారముల వదలి వనమునఁ ద్రిమ్మరుచుఁ జెట్లపై శృంగార పద్యములను వ్రాయుచు విరామములేని యవస్థ ననుభవించువాఁడో యదియే యీతిమ్మఁడు గావచ్చునని తలపోయఁ జొచ్చెను. ఇంతలోఁ దిమ్మఁడు, "అయ్యా! మాయడవిలోని వృక్షముల నెల్ల నిట్లు లేఖలచేతఁ జెఱచి శోభను దగ్గించువాఁడెవఁడు! వాఁడు నాకంటఁబడెనేని వాని తలకెక్కియున్న వెఱ్ఱిని దింపి చక్కఁగా బుద్ధిచెప్పి పంపుదును" అనెను.

'సుశర్మ, తానే యట్టివెఱ్ఱి తలకెక్కిన మోహియని యును, తానే వృక్షముల యందట్లు రిచించినవాఁడన్నియును జెప్పి'', అయ్యా! నీ వాగ్దత్తము ప్రకారము నా వెఱ్ఱి దిగు నట్లు బుద్ధి గఱపుము'' అని వేఁడికొనెను.

''బుద్ధి గఱపమనెదవా! అట్లయిన నీవు ప్రతిదినము నేనును నాచెల్లెలు పేరమ్మయు వసించునట్టి కుటీరమునకు రావలయును. నేను నీవు మోహించిన చారుమతివలె నటించెదను. నేను నిజముగానే చారుమతిగా నుంటినేని నీవెట్లు మెలఁగఁగలవో యట్లు నాయెడలఁ బ్రవర్తింప వల యును. పిదప నేను విరహిణులెట్లు తమ నాయకుల యెడలఁ బ్రవర్తింతురోయట్లు మెలఁగెదను. అట్లు నీవు సిగ్గుపడు నంతకు మెలఁగనేర్తును. ఇదియే నీమోహవ్యాపారము నుండి నిన్ను మరల్చుటకు నేను దలఁచిన యుపాయము'' అనెను తిమ్మఁడు,

తిమ్మని మాటలయందు సుశర్మకు నమ్మకము పుట్టలేదు. అట్లుండియును, తాను వాని గుడిసెకు వచ్చునట్లుగా సమ్మ తించెను. అది మొదలు సుశర్మ తిమ్మని గుడిసెకుఁ బ్రతి దినమును బోవుచుండెను. తిమ్మఁడు, తాను జెప్పిన విధము గానే చారుమతియైనట్లు నటించుచుండెను. వీరిరువురును మోహితులవలెనే శృంగార రసపూర్వకములయిన సంభా షణములను జేయుచుండురుగాని యిందువలన సుశర్మని మోహవ్యాపారము నానాటి కభివృద్ధి నొందెనుగాని డిందు పడినది కాదు.

తిమ్మఁడు, తాను గోపబాలుఁడై నట్లును, చారుమతి వలె నటించుచున్నాఁడననియును వ్యక్తముగాఁ జెప్పినప్పటి కిని, సుశర్మ, సంభాషణ కాలములయందు తిమ్మని చారుమతి గానే భావించి వ్యవహరించు చుండెను.

ఇవ్విధముగా వారి కాలము మనోజ్ఞములగు సంభా షణములతోఁ గడచుచుండెను. సత్స్వభావమగు కళావ తికి విజయపాల భూపునిఁ జేరుటకు సమయము తటస్థింప లేదే యను చింత గలిగి యుండెను. ఇట్లుండఁగా నొక్క దినము తిమ్మఁడు విజయ భూపుని యా యరణ్యమునందు సందర్శించి సంభాషించెను. అప్పుడా వృద్ధరాజు నీ ‘వంశ మెట్టిది?’ అని యడుగఁగా, నేను గొప్ప వంశమునందుఁ బుట్టిన వాఁడను’ అని తిమ్మఁడు బదులు చెప్పెను. గొల్ల బాలుఁడు గొప్ప వంశమునందుఁ బుట్టిన వాఁడననుటకు వృద్ధరాజు నవ్వి, యచ్చోటుఁ బాసెను. అది మొదలుకొని కొంతకాలము దనుక తిమ్మనికి వృద్ధరాజును సందర్శించి సంతోషించు తరుణము తటస్థింపలేదు.

ఒకానొక దినము సుశర్మ తిమ్మనితో సంభాషింప వాని కుటీరమునకుఁ బోవుచుండఁగా, ఒకఁడు గాఢనిద్రా పరవశుఁడై పరుండి యుండుటను జూచెను. వాని కంఠము దాఁపున నొక కృష్ణ సర్పము మండలము వేసికొని కూర్చుం డెను. సుశర్మ వచ్చునట్టి కాలి సవ్వడిని విని యా పాముచో టినుండి తొలఁగి చేరువనున్న పొదలఁలోఁ దూరెను. సుశర్మ వాని దాఁపునకు పోయి చూడఁగా సమీపమునందే

యొక యాఁడు సింగము వాఁడు లేవఁగానే పొరిగొన్నటకై పొంచి యుండెను. అట్టి యడనున సుశర్త అవదయగు నా మనుష్యున కుపకరింపఁ దన్ను దేవుఁ డచ్చోటికిఁ బంపినట్లుగా భావించి, పరుండి నిదురించు వాఁడెవ్వఁడని దెలియఁ గోరి వాని మోమును జూచెను. ఇట్లు రెండు విధముల నాపద లకు గుఱియై యుండిన వాఁడు, తన యన్నయగు గుణ దేవుఁడని వానికి దెలియ వచ్చెను. సరి ఈ ద్రోహి వధా ర్హుఁడే. వీనిని దైవమే శిక్షింపనుండఁగా నేనేల యడ్డుపడి సంరక్షింపవలయును!" అని దలఁచెను గాని, వాని యెడలఁ దనకుఁగల సౌభ్రాతరమును, తన యున్నత గుణ ములును అట్టిచేత కెడమియ్యలేమ. కాఁబట్టి యాక్షణమే యొరనుండి కత్తినిదూసికొని యాసింగము మీఁది కురికి దానిని ద్రెగవేసెను. ఆ సింహి తాను వేటుదిని కూలుటకు మున్నుగాఁదన తీక్ష్ణములగు నఖములతో వానిహస్తమును గాయపఱచెను.

సుశర్త సింగముతో పోరాడుచుండఁగా గుణదేవుఁడా సవ్వడికి నిదురనుండి లేచెను. తానాపదకుఁ జిక్కియుండిన ట్లును, తన్ను రక్షింపఁ దన సోదరుఁడు ప్రయత్నించుచుండి నట్లును వాఁడు గ్రహించి, తన్నుఁ గాపాడునిమిత్తము తన ప్రాణములను సైతము లక్ష్యపెట్టక మెలఁగిన తమ్ముని విష యమై తానిదివఱకును మెలఁగిన మెలఁకువలను దలఁచుకొని మిగులఁ బశ్చాత్తాపపడి కన్నీరు నించుచుఁ దన యపరా ధములను మన్నించి తన్ను క్షమింపవలయునని సుశర్తను

వేఁడుకొనెను. తత్క్షణమే గుణాఢ్యుఁడయిన సుశర్మ తన యన్న యపరాధముల నన్నిటిని మన్నించినట్లుచెప్పి యతనిని గౌఁగిలించుకొనెను. అది యాదిచేసికొని గుణదేవుఁడు తన సోదరునియెడల సత్యమైన సౌభ్రాతరమును గలిగి మెలఁగఁ దొడఁగెను. వీఁడరణ్యమునకు వచ్చినది తమ్మునిఁ జంపుటకే; అట్లుండియు దైవాధీనముగఁ దమ్మునిచే నభిరక్షితుఁడై వాని యెడల నెక్కువ మక్కువతోఁ బ్రవర్తింపఁ దొడఁగెను.

సుశర్మకుఁ దగిలిన గాయమునుండి రక్తమధికముగా స్రవించినందున వాఁడు తిమ్మని కుటీరమునకుఁ బోవునంతటి శక్తిగలిగి యుండలేదు. కాఁబట్టి, తనయన్ననుజూచి, తాను దిమ్మనితో మెలఁగునట్టి మెలఁకువలను జెప్పి, "ఈదినము నేను గాయముపడి శక్తిచెడి యున్నందున వచ్చుటకుఁ గాలే దని చెప్పిరావలయు" నని తిమ్మని యొద్దకుఁ బంపెను.

తమ్ముని యిష్టప్రకారము గుణదేవుఁడా గోపకుల గుడి సెకుఁబోయి, తానిట్టివాఁడనియు, తన్ను సుశర్మ యిట్లు రక్షించెననియును, తమ్ముఁడు సింగముతోఁ బోరి గాయపడి నందున నిచటికి వచ్చునంతటి శక్తి వానికి లేదనియును దిమ్మనికిని బేరమ్మకును జెప్పెను.

గుణదేవుఁడు తన సోదరుని విషయముగాఁ దాను నడచికొనిన దుష్పథములను గూర్చి పశ్చాత్తప్తుఁడై కన్నీరు నించుచుఁ బలికి, ద్రోహినగు నన్ను రక్షించుటయందు సాహసించి శరీరమున కాయాసము దెచ్చుకొనినాఁడు నా

తమ్ముఁడని వేదన పడుచుండఁగా, *మెత్తని మనోవృత్తిని గలిగిన కళావతి, వాని సుగుణమునకు మెచ్చినదై మనస్సునందే వానివరించెను. గుణదేవుఁడు తన పరితాపమునకై పరితపించునట్టి పేరమ్మను జూచి, ఆమెకుఁ దనయందలి గల కనికరమును గాంచి యా బిడను వరింపఁ దలఁచెను. ఇట్లు వీరు పరస్పరము వరించినట్టి సమయమునందే, తిమ్మఁడు సుశర్మ పాటును విని మూర్ఛిల్లెను. తిమ్మఁడు మూర్ఛ దీఱి లేవఁగానే, తానుపడిన యవస్థను గూర్చి గుణదేవుఁడు నిజస్థితిని దెలిసికొననట్లుగా, “అయ్యా, గుణదేవుఁడ! నే నెట్లు మూర్ఛనటించితినో విశదముగా నీ సోదరునకుఁ జెప్పుము” అనెను. అయినప్పటికిని, గుణదేవుఁడు తిమ్మని మోమునందలి వెల్లఁ బాటును గని వాఁడు నిజముగానే సొమ్మసిల్లినట్లు గ్రహించెను, “సరి, నీవంత చక్కఁగా మూర్ఛనటించినట్లే, మనుజుఁడు వహింపఁగలధైర్యమును సైతము పొందుము” అని మందలించెను. అందులకుఁ దిమ్మఁడు, “ఔను, నిజము పలికితివి. అట్లే చేసెదను, ఇంత కుముందు చారుమతిని బోలి యుంటిని. ఇప్పుడు తిమ్మఁడ నైతిని” అనెను తిమ్మఁడు.

గుణదేవుఁడు వారితోఁ జాల ప్రొద్దు మాటలాడుచుండి, తుదకు చాలిననన్ని సంగతులతోఁ దన తమ్ముని యొద్దకుఁ బోయెను. తిమ్మఁడు చారుమతిని బోలి మూర్ఛిల్లెనను సంగతిని చెప్పుటయే కాక, తాను పేరమ్మను వరించినదియుఁ దన్నుఁ బేరమ్మ వరించిన విధమును దెలిపి, “నీవు

రాజధానియందు నాస్థితికంతటికిని యజమానుఁడవై సుఖ
ముండుము. నేను గోపాలునిఁ బోలి యాగోపిక యగు పేర
మ్మను బెండ్లాడి సుఖముగా నీ యరణ్యమునందే కాలముగడు
పుచుండెదను " అనెను.

"నీవా పడుచును బరిణయ మాడుట నాకు మిగులఁ
దృప్తికరమగు పనియే. రేపు మీ వివాహము విజయ
భూపాలుని సమక్షమందు జరుగునుగాక! ఇప్పుడా గోపిక
యొంటరి పాటున నున్నది. ఎట్లనిన, ఇదిగో చూచితివా!
దాని యన్న తిమ్మఁడు నా యొద్దకువచ్చుచున్నాఁడు, ఇట్టితరు
ణమునందు నీ వచటికిఁబోయి స్పష్టముగా నా బిడనమ్మతిని
వేఁడికొనుము " అని చెప్పిపంపెను.

గుణదేవుఁడు తన తమ్ముని యిచ్చచొప్పున గోపకుని
కుటీరమును గూర్చిపోయెను. ఇంతలోఁ దనస్నేహితుని
శరీరస్థితిని దెలియఁగోరి తిమ్మఁడు సుశర్ముఁడున్న చోటికి
వచ్చి చేరెను.

తిమ్మఁడు సుశర్మునితో సంభాషించు చుండఁగానే,
సుశర్మ తన యన్న యెంత త్వరలో పేరమ్మను వరించెనని
యును, పేరమ్మయు నవ్విధముగానే గుణదేవుని నంత శీఘ్ర
మున వరించుట కానంద మొందెననియును జెప్పి, వారి
య్యుద్వాహము జేఁపానఁగూడవలయునని తాను ద్దేశించిన
ట్లును దెలిపెను. మఱియును, ఆ సుముహూర్తమునందే
నేను నా ప్రియురాలగు చారుమతిని పరిణయమాడుట కిచ్చి
పెట్టనైతిని గదా! యనియును దీనతదోఁపఁ బలికెను.

అందులకుఁ దిమ్మఁడు, సుశర్మయొక్క యభిమతమ్మును గూర్చి మిగుల సంతసించి, "నీవు నిజముగా చారుమతిని వరియించిన వాఁడవైతివేని, నీ కోర్కెయును నెఱవేఱఁ గలదు. ఆ బిడయును యుక్తకాలమునకు స్వస్వరూపముతో నిచ్చోటికి రాఁగలదు. వచ్చి నీ యిష్టప్రకారమే నిన్నుఁ బరిణయ మాడఁగలదు" అనెను.

"ఇదెట్లు నెఱవేఱఁగలదు, తిమ్మా! నీవు నాతోడ నదివఱకు మెలఁగినట్లే మెలఁగెదవు. చారుమతి యెక్కడ! నేనెక్కడ! మా యిరువురికి తేఁపి పరిణయము జరుగుట యెక్కడ! దుర్ఘటము" అనెను సుశర్మ. "అగునుచూడుము నే నెవ్విధముగానైనను గావింపఁగలను. నా మంత్రవిద్య చేత నెంతటి దుర్ఘట కార్యమునుగాని క్షణకాలముననే కొన సాఁగింపఁగలను. నా పినతండ్రి గొప్ప మాంత్రికుఁడు. అతని యుపదేశము నాకుఁ గలదు" అనెను తిమ్మడు.

తిమ్మని మాటలయందు సుశర్మకు సంపూర్ణ విశ్వాసము గలుగ లేదు. కావున, తిమ్మని ముఖముపైఁ దన చూడ్కులు నిలిపి, "మిత్రుఁడా! నీవు పరియాచకములాడెదవని భావించెదను. ఇది పరియాచకములకుఁ దరుణము కాదే" యనెను. అందులకుఁ దిమ్మఁడు, "ఓహో, నీవాలాగు సందేహింపఁ బనిలేదు. నిజము పలికెదను; నా మాటలు ప్రమాణ పూర్వకములని నమ్ముము. నీ వింకఁ బోయి మంచి యుడుపులను ధరించికొని పెండ్లికి సిద్ధపడుము. వృద్ధరాజునకును నతని యనుచరులకును నీ శుభవర్తమానము దెలిపి

సిద్ధపడియుండునట్లు చేయుము. నీవు [illegible] చారుమతిని పెండ్లాడఁ గోరితివేని సిద్ధపడియుండుము. తప్పక చారుమతియు నిచ్చోటికి వచ్చి చేరఁగలదు" అనెను.

పేరమ్మ గుణదేవునిఁ బరిణయ మాడుటకు సమ్మతించినందున, పేరమ్మయును గుణదేవుఁడును వృద్ధరాజు నొద్దకుఁ బోయి చేరిరి. వారితోడ సుశర్మయు నుండెను.

రెండు వివాహములు జరుగు సదనున నొక్కరితయే పెండ్లికొమార్తెయుండుటంబట్టి, అచటి వారందఱును సుశర్మను తిమ్మఁడు పరియాచకము చేసెనని యనుకొనిరి.

విజయభూపుఁడు, సుశర్మ వరింపబోవు యువతి తన పుత్రికయే యనియును, అది వింతగా నచ్చోటికిఁ దిమ్మని వలన రావింపఁబడుచున్నదనియును విని, సుశర్మను జూచి "నీవీ సంగతిని నమ్మెదవా!" యని సాశ్చర్యుఁడై యడిగినందులకు సుశర్మ, "నే నెట్లు చెప్పుటకును సాహసింపకున్నాను" అనెను. అంతట, తిమ్మఁడు వృద్ధరాజును జూచి, "అయ్యా, నేను మీ పుత్రికను బిలుచుకొని వచ్చిన యెడల నా పఁడతుక సుశర్మను పెండ్లి చేసికొనుటకు మీరు సమ్మతింతురా?" అనెను. అందుల కాతఁడు, "సమ్మతి మాత్రమా! నాకు రాజ్యముండిన, నా సామ్రాజ్యముతో దాని నీ వరున కిచ్చి పెండ్లిచేయింతు" ననెను. పిదప సుశర్మను జూచి, "అయ్యా! ఆ పడుచును నేను బిలుచుకొని వచ్చితి నేని యదార్థముగ నీవు వరింతువా?" అని ప్రశ్నింపఁగా నతఁడు,

"అక్కటా! ఆ యుత్తమురాలిని పెండ్లాడఁ దగిన యుత్తమ స్థితిని లేకున్నాఁడనే యని లజ్జించెద" ననెను.

పిదప తిమ్మఁడును పేరమ్మయును లోపలికిఁ బోయిరి. తిమ్మఁడు తన మగవేసమును దీసి పాఱవైచి తనకుచితమైన బట్టలను ధరించి యే మంత్ర విద్యయు లేకయే తత్క్షణమున చారుమతిగా మాఱెను. పేరమ్మయు గోపిక వేషమును దొలఁగించి తన యుడుపులను ధరించి కళావతి యయ్యెను.

వారు లోపలికిఁ బోయియున్న సమయమున వృద్ధరాజు సుశర్మను జూచి, "నాయనా! తిమ్మని ముఖమునందు చారుమతికిఁ గల చిహ్నములు గలవు. చారుమతియే తిమ్మఁడుగా మాఱియుండునా యని సందేహించెదను" అనెను. అందులకు సుశర్మ "ఔను, నేను సైతమట్లే సందేహించెద" ననెను.

వారిట్లు సంభాషించుచుండఁగానే, తమ యుడుపులతో చారుమతియును కళావతియును వచ్చి యచ్చోటఁ జేరిరి. చారుమతి తన తండ్రికి నమస్కరించి యెదుట మోకరించి నిలిచి తన్నాశీర్వదింపుమనెను. అచటి వారందఱును ఇది మంత్రవిద్యయే యని వింతపడిరి గాని, చారుమతి జరిగిన కథయంతయును జెప్పి, తామాయరణ్యమునందే మాఱువేసములతో మెలఁగుచుండుటను సైతము విన్నవించెను.

ఇట్లు విజయభూపుని సమక్షమందే సుశర్మకును చారుమతికిని, గుణదేవునకును కళావతికిని వివాహములు జరిగెను. అడవియందు ననదలకువలె వీరి వివాహములు జరిగెనని మన మనుకొనరాదు. పరస్పరానురాగముగల వధూవరులకుఁ బరిణయములు జరుగగా నందలి వారందఱును జల్లని చెట్లనీడలయందుఁ గూర్చుండి సంతోష స్వాంతులయి భోజనము చేసిరి. అట్టి తఱిని, తాము నిరీక్షింపని వార్తావహుఁ డొక్కరుఁ డచ్చోటికి వచ్చి వృద్ధరాజు రాజ్యము మరల నతని స్వాధీనతకు వచ్చెనను" శుభవర్తమాన మందించెను.

రాజద్రోహియగు సుదర్శనవర్మ, తన పుత్రికయగు కళావతియొక్క పలాయనతకు మిగులఁ గుపితుఁడయ్యెను. ప్రతిదినము దన నగరములోని ఘనులలో నొక్కొఁడొక్కఁడుగా నరణ్యమునందు తన యన్నయొద్దకుఁ బోవుచుండుటను దెలిసి, తన యేలుబడియందే తన యన్నయట్లు గౌరవింపఁబడుట కోర్వనివాఁడయి, గొప్ప సైన్యమును గూర్చుకొని తన యన్న నెదిర్చుటకు దండయాత్ర వెడలెను. అడవిని బడియున్న తన యన్నను నతని పరిజనులను కత్తివాదరకెరచేసి రాజ్యమునకు మరలవలయునని యుద్దేశించి బయలు వెడలిన యా దుష్టునకు, మార్గమధ్యమందొక సన్యాసి కనఁబడి వానికి ముక్తికైన మార్గముల నుపదేశించెను. అందువలన వాఁడు విరక్తుఁడై, తనకు రాజ్యము

వలని జోలియెందుకని దలపోసి, పూర్వము చెప్పినట్లు తన మాతను విజయభూపతి యొద్దకుఁబంపెను.

తన యొక్కయుఁ దన యనుచరులయొక్కయు ధనమును నేలలును మరల నర్పింపఁ బడెననునట్టి తాను నిరీక్షింపని శుభవర్తమానమును వినఁగానే చెప్పఁటకుఁగాని సంతోషమును విజయభూపుఁ డనుభవించెను. కళావతియును దన తండ్రియొక్క సత్కార్యమునకు సంతసించినది యయ్యెను. అది మొదలు కళావతీ చారుమతులు మిగుల ననుకూలతగలిగి [illegible] తమలో సంకురింప నీయక మెలఁగుచుండిరి.

విజయభూపుఁడు తన యనుచరులను బుత్రికలను వారి భర్తలను [illegible]కొని రాజధాని [illegible] యందు సుఖముగాఁ బ్రొద్దులు [illegible]వాఁడయ్యెను. కలతలును గలవరములును లేకుండునట్లు రాజ్యమును బరిపాలించుచుండెను.

